'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

పోలింగ్ శాతంలో తేడాలు

ఎన్నికల వ్యవస్థ నిష్పాక్షికంగా, పారదర్శకంగా ఉంటేనే ఎన్నికలకు విశ్వసనీయత ఏర్పడుతుంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలో ఈ విశ్వసనీయత మరింత ప్రాముఖ్యం సంతరించుకుంటుంది. ప్రజల తీర్పును నిక్కచ్చిగా నమోదు చేసి ఫలితాలను వెల్లడించడం అనేది ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థ ను నడిపే పెద్దల ఎంపిక విషయంలో మోదీ ప్రభుత్వం చేసిన మార్పుచేర్పులు తీవ్ర విమర్శలకు గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం తనకు అనుకూలురైన వారిని ఎంపిక చేసేందుకే ఈ ఏర్పాటు చేసిందని, ఈ చర్య ప్రజాస్వామ్యానికి విఘాతం లాంటిదని విపక్షాలు ఆరోపించడం తెలిసిందే. ఎన్నికల కమిషనర్ల ఎంపిక ప్రక్రియపై సందేహాలు తొలగించేందుకు దేశ అత్యున్నత న్యాయస్థానం కొన్ని దిద్దుబాటు చర్యలు సూచించినా మోదీ సర్కారు వాటికి గండికొట్టింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన తర్వాత, పోలైన ఓట్ల శాతం ప్రకటించేందుకు చాలా సమయం తీసుకోవటం, ముందస్తు లెక్కకు, తుదకు తేల్చిన లెక్కకు మధ్య అంతరం ఎక్కువగా ఉండటం అనేక అనుమానాలకు తావివ్వడం సహజమే.

మొదటి విడత పోలింగ్ ముగిసిన 11 రోజులకు, రెండో విడత ముగిసిన 4 రోజులకు తుది శాతాన్ని వెల్లడించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో, అదీ ఈవీఎంలతో నిర్వహించే ఎన్నికల్లో ఇంత జాప్యం అవసరమా? అనేది అసలు ప్రశ్న. ఏప్రిల్ 19 సాయంత్రం 60 శాతం పోలింగ్ నమోదైనట్టు ప్రకటించిన ఈసీ ఏప్రిల్ 30న విడుదల చేసిన ప్రకటనలో 66.14 శాతం ఓట్లు పోలయ్యాయని తెలిపింది. రెండు విడతల్లోనూ కొంచెం అటూఇటుగా సుమారు 6 శాతం తేడా రావడం గమనార్హం. టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రయన్ ఎత్తిచూపింది ఈ తేడానే. కొన్ని నియోజకవర్గాల్లో 5 నుంచి 10 శాతం ఓట్లు పెరిగాయి. ఏకంగా మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో 7.52 శాతం పెరగడం విశేషం. ఈ అదనపు ఓట్లు ఎక్కడి నుంచి వచ్చిపడ్డాయని శివసేన (ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్ నిలదీస్తున్నారు. 2019 ఎన్నికల్లో కేవలం రెండు రోజుల్లోనే పురుషులు, మహిళలవారీ లెక్కలతో సహా యావత్తు పోలింగ్ సమాచారాన్ని వెల్లడించిన ఈసీ ఈసారి ఇంతగా జాప్యం చేయడంపై సీపీఎం నేత సీతారాం ఏచూరి విస్మయం వ్యక్తం చేశారు. ఇలా ఎన్నికల శాతం పెరగడం అనేది సాధారణ విషయం కాదని గత మూడున్నర దశాబ్దాలుగా ఎన్నికల విశ్లేషకునిగా వ్యవహరిస్తున్న రాజకీయ పరిశీలకుడు యోగేంద్ర యాదవ్ చెప్తున్నారు.

సవరించిన లెక్కలను కూడా ఈసీ తన వెబ్‌సైట్‌లో పెట్టకపోవడం ఏమిటనే ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. ఇలాంటి అనుమానాలు పారదర్శకతకు గొడ్డలిపెట్టు వంటివి. ఇటీవలి కాలం వరకు ఎలక్ట్రానిక్ వోటింగ్ యంత్రాల (ఈవీఎంల)పై వివాదం కొనసాగింది. నిరాధారమైన అపనమ్మకాలు వద్దని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడంతో ఆ వివాదం సందేహాస్పదంగానే కొలిక్కి వచ్చింది. అదేవిధంగా ప్రస్తుతం పోలింగ్ శాతంపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పూర్తిగా ఎన్నికల సంఘం మీదే ఉంటుంది. ప్రజలు వేసిన పవిత్రమైన ఓటుపై అనుమానాల నీడలు పడటం ఏ మాత్రం సమర్థనీయం కాదు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా విశ్వవ్యాప్తంగా మన్ననలు అందుకునే మన దేశానికి ఇలాంటి వ్యవహారాలు అంతగా శోభించవు.

అబద్ధాల తయారీదారు మోదీ!

ప్రధాని మోదీ తన పదేండ్ల పాలనలో అబద్ధాలను వ్యాప్తి చేశారే తప్ప ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు. పైగా దేశ సంపదలైన ఎల్ఐసీ, పోర్టులు, విమానాశ్రయాలను అమ్మేశారు. అబద్ధాల తయారీదారు, డిస్ట్రిబ్యూటర్, హోల్‌సేలర్ మోదీయే.

- తేజస్వీ యాదవ్, ఆర్జేడీ నేత

బీసీలూ.. బహుపరాక్!

డాక్టర్ ఆంజనేయ గౌడ్

వేటగాళ్ల వాగ్దానాలు, వంచకుల వలలు ఎప్పటిలాగే ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ వంచితుల చుట్టూ మోహరించాయి. సుదీర్ఘ ప్రజాస్వామ్య చరిత్రలో వివక్షను దేశం నలుమూలలా వనంలా పెంచి పోషించిన రెండు జాతీయ పార్టీల అగ్రనేతలే.. న్యాయం, నమ్మకం అంటూ మళ్లీ మాయ చేయడానికి కుయుక్తుల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పూలే జీవించి ఉంటే, అంబేద్కర్ మన మధ్యలో ఉండి ఉంటే.. కమలం, హస్తం పార్టీలు తెలంగాణతో పాటు దేశంలో చేస్తున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారంపై పిడుగుల వర్షం కురిపించేవారు.

నయవంచకులే న్యాయ సూత్రాలు వల్లిస్తుంటే, బడుగులు అడుగు ముందుకేయకుండా అడ్డుగోడలు నిర్మించిన పక్షపాతులే ప్రజాస్వామ్యంపై ప్రవచనాలు ఊదరగొడుతుంటే వెయ్యి పీనుగలు తిన్న రాబందు.. శాకాహార ప్రయోజనాలను ప్రచారం చేసినట్టుగా ఉండదా? ఇప్పుడు రాహుల్‌గాంధీ, మోదీ ప్రదర్శిస్తున్న ఎన్నికల విన్యాసాలు అలాగే ఉన్నాయి. ఇంకా విచిత్రమేమిటంటే.. ఊసరవెల్లి కూడా ఉరివేసుకునేలా సీఎం రేవంత్‌రెడ్డి సైతం జనగణన, బీసీల హక్కులు, సామాజిక న్యాయం, వాటా, కోటా అంటూ చిలుకపలుకులు పలుకుతున్నారు.

నిజమే.. 'వినేవాడుంటే చెప్పేవాడికి ఎప్పటికీ లోకువే' అనే నానుడి గాలికి పుట్టలేదు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే అంబేద్కర్ ఆశయాలకు తలకొరివి పెట్టి, పూలే భావనను పూడ్చి పెట్టే పనితీరును నిత్యం కొనసాగిస్తున్నది రేవంత్‌రెడ్డి సర్కార్ కాదా? రాష్ట్ర మంత్రిమండలిలో, నియమిత పదవుల్లో, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సీట్లు, వాటాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏయే కులాలకు ఎంతెంత వడ్డించిందో అందరికీ అర్థమైపోయింది. చివరికి న్యాయవ్యవస్థలో అత్యంత కీలకమైన అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ బాధ్యతలను ఇప్పటి సీఎంలా ఒకే వర్గం వారికి గతంలో ఏ ప్రభుత్వం అప్పగించలేదు. ఇలా నాలుగు నెలల్లోనే వాటా హక్కును నడివీధిలో నవ్వుల పాలుచేసిన చర్యలు ఎన్నో? కానీ, గురివింద గింజ నైజం రేవంత్‌రెడ్డి సర్కార్‌కు, రాహుల్‌గాంధీ పార్టీకి కొత్తేం కాదన్నది దేశంలోని బుద్ధిజీవులందరికీ తెలిసిన సత్యమే. ఆ కుట్రల ఒరవడిలోనే నేడు జనగణన, బీసీల వాటా, రిజర్వేషన్లు అనే సున్నితమైన, కీలకమైన సామాజిక అంశాలపై రాజకీయ పబ్బం కోసం వెంపర్లాడుతున్నది. బహుశా మన దేశంలో లాగా, విపణిలో బీజేపీ, కాంగ్రెస్ లాంటి ద్రోహ పూరిత చరిత్ర కలిగిన రాజకీయ పార్టీలు ఇంతకాలం జనాలను ఏమారుస్తూ మనుగడ సాగించడం దుస్సాధ్యమేమో. సమ్మిళిత అభివృద్ధి, శాంతి, సామాజిక న్యాయం ఇలా ఏ అంశంలోనైనా, ఎండమావుల చుట్టూ ఏండ్లకు ఏండ్లు తిప్పి ఏమారుస్తూ.. అతిపెద్ద మానవ సమూహాన్ని బంతాటలా ఆడుకోవడం ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో అయితే చెల్లుబాటు అయ్యేదా? మన ప్రజల అమాయకత్వాన్ని నినాదాలకు బానిసలుగా మలుస్తూ, పల్లకీలో ఊరేగుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు, ఇంకా ఎంతకాలం అధిక జనాభాను జోకొట్టి, దేశాన్ని కొల్లగొడుతూ ఉంటాయి?

ఎకనామిక్ హిట్ మ్యాన్ అనే పుస్తకం ఆమధ్య ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అది తెలుగులోనూ దళారీ పశ్చాత్తాపం పేరిట ప్రచురితమైంది. ప్రపంచ బ్యాంకులో పని చేసిన ఈ పుస్తక రచయిత వర్ధమాన దేశాల సంపద ఎలా కొల్లగొట్టబడుతున్నదో అనుభవపూర్వకంగా, ఆధారాలతో రాసి ప్రపంచ పాఠకుల గుండెలు మండేలా చేశారు. అదొక పాప ప్రాయశ్చిత్త, దోపిడీ, పీడన వ్యతిరేక మానవీయ రచన. కానీ, నేడు రాహుల్ గాంధీ ప్రసంగాలు అలా కూడా ఉండటం లేదు కదా? దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ దేశంలో చేసిన అన్యాయ పాలన, పీడన, దోపిడీపై రాహుల్‌గాంధీ మాటల్లో ఇసుమంతైనా ప్రాయశ్చిత్తం వ్యక్తం కావడం లేదు. అసలు రిజర్వేషన్లు బీసీలకు అందకుండా దగా చేసిందే కాంగ్రెస్ అనే వాస్తవం నేడు కొన ఊపిరితో ఉన్న కాంగ్రెస్ మొసలి కన్నీటితో కడుక్కోలేదు కదా? కేంద్రంలో 90 ప్రభుత్వ శాఖల్లో కార్యదర్శులుగా బీసీలు కేవలం ముగ్గురే ఉన్నారని, న్యాయ వ్యవస్థతో పాటు అన్నింటా సగం జనాభా అయిన బడుగులు అట్టడుగునే పడి మగ్గుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత వల్లిస్తున్న ఊకదంపుడు ఉపన్యాసం వాస్తవమే. కానీ, ఈ అసమాన అన్యాయ వ్యవస్థకు బలమైన పునాదులు పేర్చిందే హస్తం పార్టీ కదా. రిజర్వేషన్లకు పాడెను కట్టింది కాంగ్రెస్ పార్టీ అయితే, సమాధిని నిర్మిస్తున్నది బీజేపీనే కదా? పెరియార్ పోరాట ప్రభంజనంతో గానీ బీసీల కోసం మొదటి రాజ్యాంగ సవరణ చేసేందుకు హస్తం పార్టీకి చేతులు రాలేదు. కాకా కాలేల్కర్ కమిషన్ 1953లో బీసీలకు రిజర్వేషన్లు సిఫారసు చేస్తే, ఆయన్ను ఆనాటి కాంగ్రెస్ ప్రధాని నెహ్రూ పార్లమెంట్ సెంట్రల్ హాల్‌కు పిలిపించుకొని, మందలించి, డీసెంట్ నోట్ రాయించి బీసీల భవితకు ఆదిలోనే మోకాలడ్డం పెట్టారు. తర్వాత 1993 దాకా బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా నాలుగు దశాబ్దాల పాటు బీసీల వాటాను వధించిందే కాంగ్రెస్ ప్రభుత్వాలు. మండల్ కమిషన్‌పై పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ, అవి దేశానికి ప్రమాదకరమైనవని సుదీర్ఘంగా ప్రసంగించి, బీసీల జీవితాల్లో చీకటి కుమ్మరించిందే రాజీవ్‌గాంధీ అనే సత్యం బుద్ధిజీవులందరికీ తెలిసిందే. తీరా సుప్రీంకోర్టు తీర్పుతో బీసీ రిజర్వేషన్లు అమలులోకి రావడానికి రెండేండ్ల ముందే అనగా 1991లోనే ప్రపంచీకరణ విధానాల పేరిట, ప్రైవేట్ రంగానికి తలుపులు బార్లా తెరిచి బడుగుల కుండకు చిల్లులు పెట్టింది హస్తం సర్కార్ పెద్దలే కదా? ఏడున్నర దశాబ్దాలుగా జనగణనతో పాటు అనేక అంశాల్లో కాంగ్రెస్ సర్కార్ల వంచన, కమలం పార్టీ పెద్దల సమర్థింపు వల్ల వివక్షకు వేలాడిన బీసీల హక్కులు ప్రతి సందర్భంలోనూ పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డాయే కానీ వారి రొట్టె విరిగి నెయ్యిలో పడలేదు. బీసీల కాళ్లు కాంగ్రెస్ విరగ్గొడితే, నేడు బీజేపీ ఏకంగా తినే చేతులనూ తెగనరుకుతున్నది. కేంద్ర ప్రభుత్వ సిబ్బంది సంఖ్యను 41.76 లక్షల నుంచి 34.5 లక్షలకు కుదించడమే కాదు, 16 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ కొలువులను భర్తీ చేయకుండా బీసీ రిజర్వేషన్లను ఎగ్గొట్టింది మోదీ ప్రభుత్వం. దానికితోడు ప్రైవేటీకరణ కాదు.. కాదు.. అదానీకరణకు అంతా సమర్పిస్తూ.. అడిగేందుకు ఏమీ మిగలని దశకు దేశాన్ని తాకట్టు పెట్టేస్తున్నారు. నిజానికి రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర కాదు, ఏనాడో వాటిపై నిషేధాజ్ఞలను రెండు జాతీయ పార్టీలు అప్రకటితంగా అమలు చేసేశాయి. ఇక రాజ్యాంగానికి తూట్లు కాదు, ఏకంగా పోట్లే పొడిచి, ప్రవేశిక లక్ష్యాల పీక నొక్కేశాయి. అలాగే 2021లో బీసీల జనగణన చేస్తామని 2018లో ఆనాటి హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చి, తర్వాత పంగనామం పెట్టేశారు. ఇలా ఎన్నో అంశాల్లో విలువల వధలో వీడు ఉక్కూ కాదు, వాడు తుక్కూ కాదని చెరబండ రాజు అన్నట్టుగా కమలం, హస్తం పార్టీలు బీసీల హక్కుల హననంలో పోటీ పడి పనిచేశాయి.

> **అసలు రాజ్యాంగం అర్థం కాని కాంగ్రెస్, ఇష్టమేలేని బీజేపీలూ.. ఎన్నికలను కనికట్టుగా, పరిపాలనను సర్కస్ ఫీట్లుగా మార్చేశాయి. రాజకీయాలను గుప్పెడు మంది గుత్తసొత్తుగా మార్చి, బలవంతులదే రాజ్యమనే రాతియుగ భావనను బలపరిచాయి. ఢిల్లీలో గాంధీ కుటుంబం, రాష్ట్రానికో సామాజిక వర్గం సొత్తుగా హస్తం పార్టీ.. విస్తరణకు విద్వేషం, విధానాలు కుబేరుల కోసం అంటూ కమలం పార్టీ మనుగడ సాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఏనాడో ప్రమాదంలో పడేశాయి.**

వాస్తవానికి దేశాన్ని ఇలా వివక్షావనంలా మార్చివేసిన కుసంస్కార కాంగ్రెస్, బీజేపీ విధానాలను అభివృద్ధి చెందిన వర్గాల్లోని బుద్ధిజీవులు సైతం ఈసడించుకోకుండా ఉండలేరు. ఇంకా నయం వివక్షలకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పురుడుపోసుకోకపోయి ఉంటే నేటికీ అరాచకమే అంతటా వర్ధిల్లేది. అసలు స్వాతంత్ర్య ఉద్యమంలోని సామాజికాంశంలో నుంచే రాజ్యాంగంలోని ఆదర్శవాదం, ప్రాథమిక హక్కులు, సమ భావనలను రూపొందించారు. ఆ లోతైన దృష్టి కోణం కొరవడే గాంధీలు, మోదీ, ఆయన ముందుతరాలు వివక్ష నిర్మూలనకు నడుం బిగించలేదు. కానీ, దేశంలో ఒకటి, రెండు ప్రాంతీయ పార్టీల కంటే ఎన్నో రెట్లు బీసీల ఎదుగుదలకు దోహదపడే పాలనా విధానాలు అమలు చేసింది కేసీఆర్ ప్రభుత్వం. తొలి శాసనసభ స్పీకర్, మండలి చైర్మన్, ఆర్థిక మంత్రి, కీలకమైన పదవులతో పాటు, నియమిత పదవుల్లోనూ భాగస్వామ్యం కల్పించింది. మార్కెట్ కమిటీలలో రిజర్వేషన్లు, చట్టసభల సభ్యులుగా అవకాశాలతో పాటు బీసీ కులాల ఆర్థిక స్వావలంబన, ఆత్మగౌరవం పెంచే ఎన్నో చర్యలు చేపట్టింది. కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, గురుకులాలు, గొర్రెల పంపిణీ, చేప పిల్లల పంపిణీ, విదేశీ విద్యానిధి, ఆసరా పింఛన్ల పెంపు ఇలా ఎన్నో పథకాలను బీసీ కుటుంబాలు బలోపేతం అయ్యేందుకు అమలుచేసింది. సంక్షేమ పథకాలే కాదు, బీసీల దీర్ఘకాలిక డిమాండ్లు అయిన చట్టసభలలో రిజర్వేషన్లు, బీసీ మంత్రిత్వ శాఖ, జనగణన వంటి వాటిపై శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర సర్కార్‌కు పంపింది. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని కొనసాగిస్తున్నది.

ఇంకా భవిష్యత్తులో పెండింగ్‌లో ఉన్న బీసీల డిమాండ్ల కోసం అండగా నిలబడి పోరాడే శక్తి, ఉద్యమ స్ఫూర్తి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీకే ఉంది. చారిత్రక దోషి కాంగ్రెస్, బీసీలకు ఉరి వేసే బీజేపీ వలలో బడుగులు పడితే.. మళ్లీ మోసపోవడమే తప్ప ఒరిగేదేం ఉండదు. బీసీలకు ప్రాంతీయ పార్టీలే బలం, బలగం. దశాబ్దాలుగా జాతీయ పార్టీల ప్రయోజనాలు, లక్ష్యాలు.. బీసీల హక్కులతో చేతులు కలుపనేలేదు, ఇకపై కూడా కలుపలేవు. చరిత్రలో గోముఖ వ్యాఘ్రాలుగా తేలిపోయిన హస్తం, కమలం పార్టీలను బీసీ కులాలు ఊరవతలే నిలువరించాల్సిన కీలక సందర్భమిది. ఈ రెండు పార్టీలు నిజంగా బీసీల మీద మనసుపెట్టి ఉంటే వ్యాపారవేత్తలుగా మారి దేశ జీడీపీకి జోడెద్దులుగా బీసీలు మారేవాళ్లు. చైనా వస్తూత్పత్తి విపణి మార్కెట్‌ను చేజిక్కించుకున్నట్టుగా.. భారతీయ బీసీ కులవృత్తుల ఉత్పత్తులు ప్రపంచ ఎకానమీలో వాటాను రాబట్టుకునేవి. ఆ రెండు పార్టీలు చేసిన మోసం.. బీసీల మెడకు దరిద్రాన్ని వేలాడదీసింది. అందువల్లే గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 101వ స్థానం, వరల్డ్ హ్యాపీనెస్ ఇండెక్స్‌లో 126వ స్థానం దక్కించుకొని కుమిలిపోతున్నాం. హక్కుల మాట దేవుడెరుగు అన్నమూ.. ఆనందమూ కరువైన బతుకుల భారతానికి ఈ బుద్ధిమాంద్య బీజేపీ, కాంగ్రెస్ కారణం కాదా? ఇంకా వారి నినాదాలకు లొంగిపోదామా? 45 లక్షల కోట్ల దేశ బడ్జెట్‌లో బీసీలకు పిడికెడంత పెట్టడానికి మనసు రాని మాయదారి పార్టీలు మనకెందుకు? వారి సంతకాల పెన్నులు, విధించే పన్నులు బడుగులకు భారమే కానీ, ఆదెరువుగా మారనేమారవు. మంచి రోజులు రావాలంటే మనమూ మారాలి. గాంధీ, మోదీలతో బీసీలకు ముప్పే తప్ప, మరేం ప్రయోజనం ఒనగూడదు. ఇదే చారిత్రక సత్యం.

సంకీర్ణ కూటమి సర్కార్లతోనే బీసీల హక్కులు సాధ్యమని చరిత్ర చెప్తున్నది. ఆ దిశలో ఢిల్లీ మెడలు వంచే సామర్థ్యమున్న కేసీఆర్ నాయకత్వాన్ని బీసీలు బలపరచాలి. ఎంపీ ఎన్నికల్లో అత్యధికంగా ఆరు సీట్లను బీఆర్ఎస్ పార్టీ బీసీలకు కేటాయించింది. ఆ ఆరుగురు అభ్యర్థులతో పాటు బీసీల భవిష్యత్తు కోసం నిలబడే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులందరినీ మనం గెలిపించుకోవాలి. లేకపోతే రానురాను ఏ పార్టీ కూడా బీసీలకు టికెట్లు ఇచ్చే పరిస్థితి ఉండదు. అందుకే రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలు తమ సత్తా చాటాలి. విజ్ఞతను, ఐక్యతను ప్రదర్శించాలి.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

ప్రమాదంలో ప్రజాభిప్రాయం!

పెద్దబూరి చరణ్ తేజ

సాంకేతికత-ఆధునికత కలిసి క్రోనీ క్యాపిటలిజంతో జత కట్టినప్పుడు అవి స్వాభావికంగా విభేదించే అంశాలకు కూడా వాటి మనుగడ కోసం వేదికలుగా మారుతాయి. ప్రస్తుతం మన దేశంలో నెలకొన్న పరిస్థితులే అందుకు ఒక ఉదాహరణ. సోషల్ మీడియా వేదికగా హిందుత్వ మతోన్మాద శక్తులు.. ఉద్దేశపూర్వక తప్పుడు సమాచారం, తప్పుదోవ పట్టించే వార్తలు, నిర్దిష్ట సమూహాల చుట్టూ అల్లే కుట్ర సిద్ధాంతాలు, సూడో చరిత్రలను వ్యాప్తి చేస్తూ రాజకీయ లక్ష్యాలను సాధించాలని ప్రయత్నిస్తున్నాయి. బడా కార్పొరేట్ కంపెనీల చేతుల్లో ఉన్న ఆ సంస్థలు చేష్టలుడిగి ఒక బలమైన రాజకీయ పార్టీకి అనుకూల వైఖరిని అవలంబిస్తుండటం ఆందోళనకరం.

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్, వాట్సాప్, యూట్యూబ్ తదితర సంస్థల యూజర్లలో అత్యధికులు భారతీయులే. భారతీయ యూజర్ల కారణంగా ఆ కంపెనీలు లక్షల కోట్లు గడిస్తున్నాయి. అందుకే మన దేశంలో నిష్పక్షపాతం కోసం ఆ కంపెనీలు తమ వ్యాపారాలను పణంగా పెట్టే సాహసం చేయడం లేదు. కొన్ని కంపెనీలు ఆ దిశగా అడుగులు వేస్తున్నా వాటికి తీవ్రమైన ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. సోషల్ మీడియా సంస్థల మార్కెట్ విదిత నిస్సహాయతను మతోన్మాద జాతీయవాద శక్తులు తమ అనుకూల ప్రజాభిప్రాయ నిర్మాణానికి, ప్రత్యర్థుల వ్యతిరేక కథనాల వ్యాప్తికి విచ్చలవిడిగా వాడుకుంటున్నాయి.

ఏ ఎన్నికల్లో అయినా ప్రజలే నిర్ణేతలు అనేది సాంప్రదాయ పార్లమెంటరీ సూత్రీకరణ. కానీ, ఆ మెజారిటీ ఓటర్ల ప్రవర్తనను ప్రభావితం చేసే సైకలాజికల్ యంత్రాంగంగా సోషల్ మీడియా మారిపోయింది. అందుకే రాజకీయ పార్టీలు దాని మీద అంతగా ఆధారపడుతున్నాయి. ఆయా వేదికలను వాడుకోవడంలో ఆరితేరిన పార్టీలకు, వాటికి దన్నుగా పనిచేసే మత తత్వ సంస్థలకు, వారి అనుయాయులకు.. ఈ ఎన్నికల్లో ఓటేయనున్న వారిలో అత్యధికులు 18-40 ఏండ్లలోపు ఉన్న మిలీనియల్స్- జెన్-జీలే అధికమని, వారి దైనందిన వ్యక్తిగత జీవితం సోషల్ మీడియాతోనే ముడిపడి ఉన్నదని బాగా తెలుసు. అందుకే ఎప్పుడో మొదలుపెట్టిన మాయల ప్రచారాన్ని ఇప్పటికీ దూకుడుగా కొనసాగిస్తున్నారు. వీ-డెమ్ లాంటి ప్రతిష్ఠాత్మక పరిశోధన సంస్థలు 2023 నాటికే మన దేశాన్ని ఎన్నికల ద్వారా ఏర్పాటైన నియంతృత్వంగా గుర్తించాయి.

'సామాజిక భ్రమల్లోకి నెట్టివేసిన సమాజంలో ప్రజలు వాళ్లకు రుచించని ఆధారాలను తిరస్కరిస్తారు. ఆకర్షణీయంగా ఉన్న తప్పులనే నమ్మి కీర్తిస్తారు. అలాంటి భ్రమలను సృష్టించేవారు వారికి యజమానులుగా మారుతారు. కానీ, ఆ భ్రమల్ని తొలగించే వాళ్లు శత్రువులుగా మిగిలిపోతారు' అని ఫ్రెంచి సోషల్ సైకాలజిస్ట్ గుస్తవే లేబాన్ చేసిన హెచ్చరికను ఈ పరిస్థితి గుర్తుచేస్తున్నది.

దేశ ఆర్థిక పరిస్థితి, విద్య, నిరుద్యోగం, ఆకలి, శాంతిభద్రతలు, ఆరోగ్యం, చరిత్ర, సైన్సు.. ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా దేశంలో వాస్తవిక పరిస్థితి ఒకలాగా ఉంటే సోషల్ మీడియా వేదికగా కుప్పలుతెప్పలుగా పుట్టుకొచ్చిన సూడో చరిత్రకారులు మాత్రం అందుకు భిన్నంగా అభూత కల్పనలను సృష్టిస్తున్నారు. ప్రామాణిక గణాంకాలకు, చారిత్రక పరిశోధనలకు సైతం అంతుచిక్కని విధంగా కథనాలు వండి వారుస్తూ సాధారణ ప్రజలను భ్రమల్లోకి నెట్టేస్తున్నారు. వాళ్లు సృష్టిస్తున్న వదంతులు, దుష్ప్రచారాలన్నీ చాలామంది జేబుల్లోంచి (ఫోన్) మెదళ్లలోకి ప్రవేశించినవే. ఇలాంటి సూక్ష్మ, స్థూల అంశాలను పరిశీలించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రపంచాన్ని కలవరపెడుతున్న తప్పుడు సమాచారం విపత్తును తక్షణం ఎదుర్కొనే దేశాల్లో భారత్ ప్రథమ స్థానంలో ఉందని హెచ్చరించింది.

> **స్క్రీన్ వెనకాల మారుపేర్లతో, మారుఫొటోలతో లేదా ఒక వ్యక్తిగా, ఒక మీడియా సంస్థగా, ఫేస్‌బుక్ పేజీలుగా, వాట్సాప్ గ్రూపులుగా నడిచే ఈ ఆన్‌లైన్ గుంపులు, ప్రభావకులు కేవలం వారు పనిచేస్తున్న పార్టీ రాజకీయ ప్రత్యర్థుల మీద, పార్టీల మీద వ్యతిరేక ప్రచారాలతో ఆగిపోలేదు. బలహీనమైన, సాంస్కృతికంగా భిన్నమైన మైనారిటీలను, దళితులు, ఆదివాసీలను ఎంచుకుని వారి సంస్కృతిని, అస్తిత్వాన్ని, మనుగడనూ ప్రశ్నిస్తున్నారు. వ్యతిరేక రాజకీయ అభిప్రాయాలున్న వ్యక్తుల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు.**

చరిత్ర వాఖ్యానానికి సంబంధించిన ఏ విద్యార్హత లేని ఒక ప్రభావకుడు 'అసలు కులానికి, హిందూమతానికి సంబంధమే లేదు, అది బ్రిటిష్‌వాళ్ల సృష్టి' అని అంటాడు. ఇంకొకాయన 'అసలు అంబేద్కర్‌కు చదువే రాదు, రాజ్యాంగ రచనలో ఆయన పాత్ర ఏమీ లేదు' అని అంటాడు. దళితులకు, ఇతర వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల వల్లనే దేశం వెనుకబడిందని ఇంకొక ఐటీ సెల్ భటుడు తీర్పు ఇస్తాడు. మైనారిటీలను నేరగాళ్లుగా, వారు ఉండే ప్రాంతాల్లో వేరే వాళ్లకు రక్షణే లేదని, అక్కడ ప్రభుత్వ యంత్రాంగం అసలు పని చేయదని ఇంకొందరు కథలు వ్యాప్తి చేస్తారు. ఇంకాస్త తలపండిన ప్రభావకులైతే మేధోమథనాల పేరు మీద చర్చలు పెట్టి, దళితులు, మైనారిటీల మీద, రాజ్యాంగం మీద బురద జల్లే ప్రయత్నం చేస్తారు. చరిత్ర అంతా తప్పు అని తీర్మానించేస్తారు.

గత వైభవాన్ని మళ్లీ తీసుకొస్తానని యువకులు, మధ్య తరగతి వారిని రెచ్చగొట్టి 90 ఏండ్ల కిందట జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత జోసెఫ్ గోబెల్స్‌ను సాంస్కృతిక-ప్రాపగండా శాఖమంత్రిగా నియమించారు. చరిత్ర, సైన్స్, అర్థ శాస్త్రం, రేడియో, సినిమా, సాహిత్యం, పత్రికలు, పిల్లల ఆటలు-పాటలు, బొమ్మలు.. ఇలా ఏ రంగాన్ని కూడా వదలకుండా అన్నింటిని ఆయన యూదు వ్యతిరేక అంశాలతో నింపేశారు. ఫలితంగా ఇటువంటి సోషల్ మీడియా లేని ఆ కాలంలో జరిగిన యూదుల ఊచకోత ఒక నెత్తుటి చరిత్రకు సాక్ష్యంగా మిగిలిపోయింది.

ఈ ఎన్నికలకు నెలరోజుల ముందు యూట్యూబ్ వంటి వేదికల మీద ప్రభావకులుగా చెలామణిలో ఉన్న సుమారు 24 మందికి కంటెంట్ క్రియేటర్స్ పేరిట ప్రధాని మోదీ అవార్డులను అందజేసింది. ఆ పురస్కారాలను అందుకున్నవారిలో సగానికి పైగా బీజేపీ ఎదుగుదలకు తోడ్పడ్డ వాళ్లు లేదా ఆ పార్టీ భావజాలాన్ని వ్యాప్తి చేసినవాళ్లే. వారికి ఇచ్చిన గుర్తింపు, ప్రోత్సాహం అట్లాంటి విషయాల హేతుబద్ధతను, శాస్త్రీయతను పక్కకుపెట్టి నమ్మిన విషయం ప్రమాదకరమని తెలిసినా, ఎలాగైనా ప్రచారం చేసే వాళ్లకొక ఉత్ప్రేరకం లాంటిది. నేడు సోషల్ మీడియా ప్రభావకులుగా చెలామణి అవుతున్న వేలాదిమంది ఆన్‌లైన్ పోకిరిల చేతుల్లో బహుశా కొన్ని కోట్ల మంది ఓటర్ల మెదళ్లు ఉన్నాయి. వాళ్లు ఎన్నికల్లో ఓటర్ల నిర్ణయాన్ని మాత్రమే కాదు, తదనంతరం జరిగే పరిణామాల్లో వారి పాత్రను ప్రభావితం చేయబోతున్నారనేది ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, అదే నిజం.

ఢిల్లీ గద్దెను బద్దలుకొడదాం

తెలంగాణ విజయ్
94919 98702

'ఆయనొక విప్లవం, అంతుచిక్కని పద్మవ్యూహం, తన వ్యూహాలతో ప్